క్లుప్తంగా

## సూక్ష్మ ఊయలలో సువర్ణ గణపతి





ఊయలలో ఉన్న పసిడి గణపతి, (అంతర చిత్రం) రూపకర్త తాళాబత్తుల సాయి

పెద్దాపురం: నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని సూక్ష్మ ఊయలలో పసిడితో రూపొందించిన గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. 50 మిల్లీ గ్రాముల బంగారంతో తయారు చేసిన గణనాథుడి విగ్రహాన్ని రోజ్ ఉడ్‌తో తయారు చేసిన సూక్ష్మ ఊయలలో అందంగా అమర్చారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత తాళాబత్తుల సాయి దీన్ని రూపొందించారు.

## చేతిరాతపై ఉపాధ్యాయులకు శిక్షణ

ఎంఈఓ శివరామకృష్ణయ్య



చేతి రాత శిక్షణలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చేతి రాతపై శిక్షణ పొందాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు చేతి రాత శిక్షణను ఆయన ప్రారంభించారు. హెచ్‌ఎం మీనామాధురి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా శిక్షణ పొందాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మిగిలిన వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. మండల పరిధిలోని ఎనిమిది వేల మంది విద్యార్థులకు ఇంగ్లిషు, తెలుగులో చేతిరాతపై మూడు నెలల్లో శిక్షణ పూర్తి చేయాలని ఆయన వివరించారు. డీఆర్పీ అబ్రహం, ఎంఆర్పీలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, జ్యోతి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ–2 పి.పుల్లయ్య, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి పుట్టుకొచ్చినవే పాటలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూరిబాబు రాజు తదితరులు

పెద్దాపురం: ప్రజల నుంచే పాటలు పుట్టుకువచ్చాయని, తిరిగి వారికి అందించే ప్రయత్నమే గీతాల ప్రచురణ లక్ష్యమని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. స్థానిక బంగారమ్మ గుడి వీధిలో రామాంజనేయ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం నెక్కల పైడియ్య రచించిన భక్తి గీతాల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పిల్లా పెద్దకాపు అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభలో సూరిబాబు రాజు మాట్లాడుతూ భక్తి గీతాలను ప్రజలకు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చల్లా సాయిరాం, వడ్లమూరు బూరయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉపవాస ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనల విశిష్టతను వివరిస్తున్న పాస్టర్ అభిషేక్

పెద్దాపురం: క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన దైవజనులు సీయోన్ శామ్యూల్, రమేష్, అభిషేక్ దైవ ప్రసంగం చేశారు. కార్యక్రమంలో మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, దైవజనులు, విశ్వాసులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు

పిఠాపురం: బీజేపీ సభ్యత్వ నమోదును శుక్రవారం పిఠాపురం అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు ప్రాంభించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి చేతుల మీదగా సభ్యత్వం తీసుకొన్నారు. ఈ సందర్భంగా వరద సహాయ నిధికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు కృష్ణంరాజ్ తెలిపారు.

## వనదుర్గమ్మకు చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

# స్వాగతమయ్యా గజాననా..

- చవితి ఉత్సవాలకు ఊరూ వాడా సిద్ధం
- విరివిగా పత్రి కొనుగోళ్లు
- మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థలు



సామర్లకోటలో పత్రి, విగ్రహాల కొనుగోలుకు తరలివచ్చిన భక్తులు

సామర్లకోట: నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలకు వాడవాడలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇళ్ల వద్ద, దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఆయా ముఖ్య కూడళ్లలో మందిరాలు, పందిళ్లు ఏర్పాటయ్యాయి. ఈ మేరకు ఆటో, లారీ, టాక్సీ స్టాండ్లలో మందిరాలు ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలోని గణపతి ఆలయాలను విద్యుద్దీపాలు, చలువ పందిళ్లతో అలంకరించారు.

**పత్రికి పోటెత్తిన ప్రజలు**

వినాయక చవితి పూజలకు ప్రత్యేకమైన పత్రి కొనుగోళ్లకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. పలు రకాల పళ్లు, కాయలు, చెరకు గడలు, మొక్కజొన్న పొత్తులు, తోరణాలకు మామిడాకుల విక్రయాలు భారీగా సాగాయి. శుక్రవారం వర్షం కురియడంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

**మట్టి విగ్రహాలపై అవగాహనకు ఉచిత పంపిణీ**

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణ చేసుకోవాలని సూచిస్తూ ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను పంచారు. ఇందులో భాగంగా పెద బ్రహ్మదేవం గ్రామానికి చెందిన శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం 500 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు ప్రారంభించారు. అలాగే లయన్స్ క్లబ్, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ జరిగింది.



చెందుర్తిలో మట్టి వినాయకుడి విగ్రహాలు పంపిణీ



సామర్లకోటలో మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన ఆర్డీఓ సీతారామారావు

**మట్టి వినాయకుని పూజిద్దాం..**

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పర్యావరణాన్ని రక్షిద్దాం మట్టి వినాయకుని పూజిద్దాం అనే నినాదంతో మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.సురేష్ కుమార్ అధ్యక్షతన కాకినాడకు చెందిన వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా మట్టి వినాయకుని ప్రతిమలను విద్యార్థులకు, ప్రజలకు పంపిణీ చేసారు. ఆయనతో పాటు గోవిందరాజులు, సావిత్రి, శ్రీలక్ష్మి, చిరంజీవి, ఇస్మాయిల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి విగ్రహాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేశవరావు, డి.కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి**



పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మట్టి విగ్రహాల ఏర్పాటుపై ప్రతి ఒక్కరిలోను అవగాహన రావాలి. తద్వారా భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందజేసినవారమవుతాము.

– జె.సీతారామారావు, ఆర్డీఓ, పెద్దాపురం

## ఆశీలు పేరుతో దోపిడీ



డబ్బు ఇవ్వాలని వ్యాపారిని డిమాండ్ చేస్తున్న ఆశీలు సిబ్బంది

సామర్లకోట: చవితి ఉత్సవాల సందర్భంగా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఆశీల పాటదారు సిబ్బంది దోపిడీ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.50 నుంచి రూ.150 వరకు వారి నుంచి వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరిస్తూ వ్యాపారాలకు అటంకం కలిగిస్తున్నారు. మున్సిపల్ గెజిట్ ప్రకారం ఆశీలు వసూలు చేయాల్సి ఉండగా చిరువ్యాపారుల అవసరాన్ని బట్టి అందినంత దోచుకొంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటువంటి వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పంచారామ క్షేత్రంలో నేడు గణపతి హోమం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గణపతి హోమం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇక్కడి ఆవరణలో కొలువైన గణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం మధ్యాహ్నం స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని, భక్తులు పాల్గొన్ని స్వామి వారి ప్రసాదం స్వీకరించాలన్నారు.

## మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజ



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కాకినాడకు అయోధ్య రామయ్య ధనుర్బాణాలు



ధనుర్బాణాలను దర్శించుకుంటున్న భక్తులు

బోట్‌క్లబ్: అయోధ్యలోని కోదండరామునికి స్వర్ణ, రజితాలతో తయారు చేసిన ధనుర్బాణాలు కాకినాడకు చేరుకున్నాయి. వాటిని స్థానిక భక్తులు దర్శించుకున్నారు. అయోధ్యవాసి చల్లా శ్రీనివాసశాస్త్రి దేశ వ్యాప్త ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా శుక్రవారం గాంధీనగర్‌లోని వీరేష్ ప్రసాద్ స్వగృహంలో కొద్దిగంటల పాటు భక్తులు దర్శనార్థం వాటిని ఉంచారు. తొలుత ధనుర్బాణాలకు శాస్త్రోక్తంగా భక్తులు పూజలు చేశారు. శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ ఐదేళ్లుగా అయోధ్యలో నివాసం ఉంటున్నానన్నారు. బాలరాముని మందిర ప్రతిష్ఠకు రజిత ఇటుకను బహూకరించగా మరో నాలుగింటిని అందించాల్సిందిగా ట్రస్టు కోరగా వాటిని అందజేశానన్నారు. తాజాగా కేజీ వెండి కిలో బంగారంతో తయారుచేసిన 14 అడుగుల స్వర్ణ, రజిత ధనుర్బాణాలను పీఠాధిపతులు, మఠాధిపతులు, ప్రముఖ దేలయాల్లో స్వామి వార్ల వద్ద పూజలు చేయించి వచ్చే ఏడాది కోదండ రామునికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.సత్యనారాయణ, శ్రీనివాస అచార్యులు, గరిమెళ్ల లక్ష్మీనారాయణ, తనికెళ్ల రాంబాబు, పరశురామ్, కె.సత్యనారాయణ, తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రత్తిపాడు రూరల్: ప్రకతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి వై.గంగాధర్ అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువులకు బదులుగా జీవామృతం, బ్రహ్మాస్త్రం, తూటికాడ కషాయం వంటి సెంద్రియ ఎరువులను వాడటం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మెంటర్ ఎం.మల్లేశ్వరి, మాస్టర్ ట్రైనర్ చినబాబు, వీహెచ్‌ఏ గణేష్, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి



అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లుల సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉష

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అనంత లక్ష్మి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా కుతుకుడుమిల్లిలో సతీష్‌చంద్ర కాలనీలోని 94వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెల రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార మాసోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఐ.విజయదుర్గ వి.దుర్గా భవాని పాల్గొన్నారు.

**పోషకాహారంపై అవగాహన**

సామర్లకోట: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరికీ పోషకాహారం లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని సీడీపీఓ ఉష అన్నారు. శుక్రవారం స్థానిక కోటపేట, పెద్ద బజార్, గొల్లపేట, బలుసులపేటల సెక్టార్ పరిధిలో పోషకాహార మాసోత్సవాలు నిర్వ హించారు. సెక్టార్ సూపర్‌వైజర్ మంగ అధ్యక్షతన ఆయా కేంద్రాల పరిధిలో పోషకాహార అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

## బావి స్థలం కబ్జా

- యథేచ్ఛగా ఇంటి నిర్మాణం
- అధికారులకు వివరించామన్న పంచాయతీ కార్యదర్శి



రాత్రి సమయంలో చేపడుతున్న ఇంటి నిర్మాణం



ఆక్రమిత స్థలంలో వేసిన పిల్లర్లు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు గ్రామంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారు. గతంలో ఈ స్థలంలో బావి ఉండేది. స్థానికంగా ఉన్న ప్రజలు దీనిని ఉపయోగించుకునేవారు. పైప్‌లైన్ల ద్వారా ప్రజలకు ప్రభుత్వం తాగునీరు అందిస్తుండడంతో ఈ బావిని మూసేశారు. దీంతో ఆక్రమణదారుల కన్ను దీనిపై పడి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇప్పటికే గోతులు తవ్వి పిల్లర్లు వేశారు.

**నోటీసులు ఇచ్చినా నిర్మాణం..**

దీనిపై పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను వివరణ కోరగా పంచాయితీ స్థలాన్ని ఆక్రమించడంపై ఇటీవల బొడ్డు సూర్యలక్ష్మికి నోటీసులు ఇచ్చామని, అయినా లెక్కచేయకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు వివరించామని, వారు తగిన చర్యలు తీసుకుంటారని వివరించారు.

## గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్ బాబు

ప్రత్తిపాడు రూరల్: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పని కృషి చేస్తోందని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు అన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో భాగంగా మండలంలోని మెట్టచింత, బవురవాక గిరిజన గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రోడ్లు, టెలికాం వ్యవస్థ, విద్యుత్, గృహనిర్మాణం, సురక్షిత తాగునీరు, పారిశుధ్య వసతులు, విద్యా, వైద్యం, జీవనోపాధి కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథ్, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని రాఘవపట్నం, దబ్బాది, ధనంబంద, కొత్తూరు, వల్లూరు, మాతయ్యపేట, ముకులూరు, సత్యవరం, గ్రామాల్లో శుక్రవారం ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రెడ్డి ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా కట్రాళ్లకొండ రహదారి



కట్రాళ్లకొండ వద్ద ప్రమాదకరంగా మారిన ఆర్ అండ్ బీ రోడ్డు

తుని రూరల్: తుని కట్రాళ్లకొండ వద్ద ఆర్అండ్‌బీ రహదారికి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. చినుకుపడితే గుంతల్లో వర్షపునీరు చేరి నాలుగైదు రోజులు రాకపోకలకు అవరోధం కలుగుతోంది. కట్రాళ్లకొండ వద్ద తాండవ శివాలయం, అయ్యప్ప స్వామి, కనకదుర్గమ్మ, వరలక్ష్మీదేవి తదితర ఆలయాలు, సమీపంలోనే సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి తపోవనం ఆశ్రమం ఉన్నాయి. తుని నుంచి కుమ్మరిలోవ, కొలిమేరు, ఎస్.సూరవరం, ఎస్‌బీ పేట, ఎస్ఎస్‌వీ నగరం, కోటనందూరు మండలం కొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం తదితర గ్రామాలు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. రానున్న దసరా, కార్తిక మాసంలో వేలాది మంది భక్తులు ఈ ప్రాంతానికి తెల్లవారుజామున వచ్చి తాండవ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, దైవ దర్శనాలు చేసుకోనున్నారు. ఈ ప్రాంతంలోనే తాండవ నదిపై పోలవరం ప్రధాన ఎడమ కాలువ ఆక్విడెక్టు నిర్మాణంలో ఉండడంతో రాకపోకలు సాగించే వాహనాదారులు, ప్రయాణికులు బురదలో జారిపడుతున్నారు. రాత్రి వేళల్లో మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆక్విడెక్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న మూడు వందల మీటర్ల మేర రహదారి నిర్మించాలని ఆలయాలకు, ఆశ్రమానికి వచ్చే భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి ఉన్నత అధికారులను ఆదేశించి రహదారికి మోక్షం కల్పించాలని కోరుతున్నారు.

## ఎన్నాళ్లు సాగుతుందీ విచారణ ?



కిర్లంపూడి సొసైటీలో అధికారులతో మాట్లాడుతున్న నాగబాబు, రైతులు

కిర్లంపూడి: స్థానిక సొసైటీలో అక్రమాలపై చేస్తున్న విచారణ ఎన్నాళ్లు కొనసాగుతుందని మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు అధికారులను ప్రశ్నించారు. కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సుమారు రూ.100 కోట్లకు పైగా అవకతవకలు జరిగాయనే ఫిర్యాదు మేరకు కేంద్ర సహకార బ్యాంకు అధికారులు విచారణ చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సొసైటీ పరిధిలోని రైతులందరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని టాంటాం వేయిస్తున్న దానిపై మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు శుక్రవారం అభ్యంతరం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా సాగుతున్న విచారణ ఇప్పటి వరకు పురోగతి సాధించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రస్తుతం రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలంటూ టాం టాం వేయడం విచారణను పక్కదోవ పట్టించటానికేనా ? అని కిర్లంపూడి సొసైటీలో విచారణ చేస్తున్న అధికారులను నిలదీశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని విచారణలో జాప్యం జరగకుండా చూడాలని కోరారు.

## పీఆర్ ప్రతిభకు బీటలు

- రెండేళ్ల శ్రమ నిష్ప్రయోజనం
- ఏ నుంచి బీ ప్లస్‌ప్లస్‌కు పడిపోయిన న్యాక్ రాంకింగ్



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యాప్రమాణాల స్థాయి తగ్గిపోతోంది. గత రాత్రి నేషనల్ ఎసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సెల్ (న్యాక్) విడుదల చేసిన ర్యాంకింగుల్లో 2.82 స్కోర్‌తో బీ ప్లస్‌ప్లస్ రావడంతో ఆ కళాశాల యాజమాన్యం నిరుత్సాహపడ్డారు. ఉమ్మడి జిల్లాలో పేరొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పీఆర్ డిగ్రీ కళాశాల ఒకటి. ఈ కళాశాలలో చదివిన వారు ఎందరో సాహిత్య, కళా, సినీ, రాజకీయ రంగాల్లో పేరు గడించారు. ఇంతటి ఖ్యాతి గడించిన కళాశాలను న్యాక్ బృందం గత వారం మూడు రోజుల పాటు సందర్శించి మౌలిక వసతులు, బోధన, బోధనేతర విభాగాలను పరిశీలించారు. ఐదేళ్ల కాలపరిమితితో న్యాక్ ఇచ్చే ర్యాంకింగ్‌ను 2017లో అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ చప్పిడి కృష్ణ 3.17 స్కోర్‌తో బీ గ్రేడ్‌గా ఉన్న దానిని ఏ స్థాయికి తీసుకువచ్చారు. ఈ గ్రేడ్ పరిమితి 2022లో ముగిసింది. మళ్లీ న్యాక్ బృందం వస్తుందన్న కారణంగా సుమారు రూ.కోటి కళాశాల నిధులతో పలు అభివృద్ధి పనులు చేసినా ఫలితం లేకపోయింది. వచ్చిన కమిటీకి సరగ్గా కళాశాల వసతులు, ప్రాధాన్యాన్ని వివరించకపోవడంతో పాటు, వివిధ విభాగాల అధ్యాపకులతో ప్రిన్సిపాల్‌కు సమన్వయలోపం వల్లే ఈ స్థాయికి పడిపోయిందని పలువురు అధ్యాపకులు చెప్తున్నారు. కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ సాధించాలంటే ఇంటర్మీడియెట్‌లో 80 శాతం మార్కులతో సాధించిన ఒకొక్క సీటుకు 40 నుండి 50 మంది పోటీపడుతుంటారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఉన్న ఈ కళాశాలకు తాజా ర్యాంకింగ్‌తో మరో ఐదేళ్లపాటు ప్రాధాన్యం తగ్గుతుంది. ముఖ్యంగా కళాశాలకు కేంద్ర నుంచి వచ్చే యూజీసీ, రూసా నిధులు, పరిశోధనలకు సహకారం వంటి వాటికి అవరోధం ఏర్పడుతుంది. ఏఐసీటీఈ, డీఎస్‌టీ సైన్స్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వంటి వాటికి దరఖాస్తు చేసుకునే వాటికి అవకాశాలు తగ్గిపోనున్నాయి.

ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యంను వివరణ కోరగా న్యాక్ బృందానికి తగిన నాణ్యత ప్రమాణాలు కళాశాలలో కనిపించకపోవడం వల్ల గ్రేడ్ తగ్గిందన్నారు. ముఖ్యంగా పూర్తిస్థాయిలో అధ్యాపకులు, పరిశోధనలు, విద్యార్థులకు ఉపాధి తక్కువగా ఉండటం ప్రధాన కారణాలుగా ఉన్నట్టు వారు తెలిపినట్టు చెప్పారు.

## చేపల చెరువుల లైసెన్సులు రద్దు చేయండి



ఆర్డీఓ, తహసీల్దార్‌లతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్: తొండంగి మండలం కోదాడ ఉప్పుటేరులో చేపల చెరువుల లైసెన్సులు రద్దు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అధికారులను ఆదేశించారు. తుని మండలం తేటగుంట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుటేరులో ఆక్రమణలపై ఇటీవల గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఉప్పుటేరులో నీటిని సేద్యం, మంచినీటి అవసరాలకు వినియోగించాలన్నారు. చేపల చెరువుల వ్యర్థాలు వేయడం వల్లే ఇటీవల పలు గ్రామాల్లో డయేరియా ప్రబలిందన్నారు. వెంటనే ఉప్పుటేరులో చేపల చెరువుల లైసెన్సులు రద్దు చేయాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు, తహసీల్దార్ మురార్జీలను ఆదేశించారు. పేదలకు పక్క గృహాల పేరుతో కొనుగోలు చేసిన భూముల వివరాలు, రైతులకు ఎంతమేరకు పరిహారం చెల్లించారో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ, తహసీల్దార్‌లను ఆదేశించారు. తహసీల్దార్ సుభాష్, డీటీ కుసరాజు, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.